

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

గ్రంథాలయ అధికారి ఎం.శ్రీదేవి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి శాఖ గ్రంథాలయంలో ఈ నెల 28వ తేదీ సోమవారం నుంచి జూన్ ఆరో తేదీ వరకూ వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి ఎం.శ్రీదేవి ఆదివారం తెలిపారు. ప్రతి రోజూ ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకూ వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, కథలు చదివించడం, డ్రాయింగ్, క్రాఫ్ట్ వర్క్, డ్యాన్స్, యోగా, ఆటలు, పాటలు విద్యార్థులకు నేర్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మత్స్యశాఖలో దోపిడీ దందా..!

'మత్స్యశాఖలో కొంతమంది అధికారుల దోపిడీ దందా తారాస్థాయికి చేరింది. 'నిబంధనలతో సంబంధం లేదు.. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పట్టించుకోరు.. వందల ఎకరాల చేపల చెరువులు చేసే బడాబాబులు ఏం చెబితే అదే శాసనం అన్నట్లు ముందుకు సాగుతూ సన్న, చిన్నకారు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.. బడాబాబుల కన్నుపడిన చేపల చెరువులను వారికి అప్పగించేందుకు చిన్న, సన్నకారు రైతులకు అడ్డగోలుగా నోటీసులు జారీ చేసి బెదిరించి దారికి తెచ్చేందుకు ఎంతకైనా తెగిస్తున్న పరిస్థితులు కొనసాగుతున్నాయి.' అనేక ప్రాంతాల్లో ఇలాంటి సమస్యలు కొనసాగుతున్నప్పటికీ నిడమర్రు మండలం మత్స్యశాఖ అధికారి (ఎఫ్‌డిఒ) మాత్రం తన రూటే సెపరేటు అంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల రెవెన్యూ అధికారులు, జిల్లా మత్స్యశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో బాధితులు మత్స్యశాఖ కమిషనర్ వద్దకు సమస్యను తీసుకెళ్లడంతో ఎఫ్‌డిఒపై విచారణకు ఆదేశించారు. విచారణైనా సరిగా నిర్వహిస్తారో, లేదో చూడాల్సి ఉంది.



దాదాపు ఏడాదిగా నిలిచిపోయిన చిన్న, సన్నకారుల రైతుల ఆరెకరాల చేపల చెరువు

- చిన్న, సన్నకారు రైతుల చేపల చెరువులపై బడాబాబుల కన్ను
- లీజుకు ఇవ్వనంటే రంగంలోకి మత్స్యశాఖ అధికారులు
- అడ్డగోలుగా నోటీసులు జారీచేసి రైతులకు బెదిరింపులు
- నిడమర్రు మండలం మత్స్యశాఖ అధికారి దందా తారాస్థాయికి
- చోద్యం చూస్తున్న తహశీల్దార్ ఆధ్వర్యంలోని మండల కమిటీ
- రెవెన్యూ అధికారులు సైతం బడాబాబులతో మిలాఖత్, భారీగా ముడుపులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నిడమర్రు మండలం అడవికొలను గ్రామం తిమ్మారావుగూడెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 164-2, 3 మరికొన్ని సర్వే నెంబర్లలో ఐదుగురు సన్న, చిన్నకారు రైతులు ఆరెకరాల చేపల చెరువు తవ్వుకున్నారు. ఆ చెరువుకు పక్కగానే సర్వే నెంబర్లు 148 నుంచి 182 మధ్యలో దాదాపు 150 ఎకరాల్లో చేపల చెరువు తవ్వకాలు సాగించారు. 2015 కాలంలో ఈ చెరువు తవ్వకంపై తీవ్ర దుమారం రేగింది. సర్వే నెంబర్లు 148-163లో తవ్విన 70 ఎకరాల చేపల చెరువులో ప్రభుత్వ పంటబోదెను కలిపేసి తవ్వకం సాగించడంపై అప్పట్లో అధికారులు పలు చర్యలు సైతం తీసుకున్నారు. తర్వాత మసిపూసి మారేడుకాయ చేసి ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ చేపల సాగు సాగించేస్తున్నారు. 150 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చేపల చెరువులను లీజుకు తీసుకున్న బడాబాబుకు పక్కనే ఉన్న ఆరెకరాల సన్న, చిన్నకారుల రైతుల చేపల చెరువుపై పడింది. సదరు బడాబాబుకు చెరువు లీజుకు ఇచ్చేందుకు చిన్నకారు రైతులు అంగీకరించలేదు. దీంతో నిడమర్రు మండలంలో మత్స్యశాఖ అధికారి (ఎఫ్‌డిఒ)గా పని చేస్తున్న రవికుమార్‌ను రంగంలోకి దిగారు. జిల్లావ్యాప్తంగా ఉన్న చేపల చెరువుల్లో దాదాపు 80 శాతం రొయ్యల సాగు ఉంది. రైతులను బెదిరించి దారికి తెచ్చే కుట్రలో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా రొయ్యల సాగు చేస్తున్నారంటూ చిన్న, సన్నకారు రైతులకు నోటీసులు జారీ చేశారు. మత్స్యశాఖ అధికారికి ఫిర్యాదు ఇచ్చినట్లు చెబుతున్న వ్యక్తి చెరువులో సైతం రొయ్యల సాగే చేస్తుండటం గమనార్హం. దీంతో సదరు రైతులు రొయ్యల సాగు నిలిపివేసి చేపల సాగుకు లీజుకు ఇచ్చారు. దీంతో సీపేజీ (ఊటబోదె) తవ్వలేదంటూ మరో నోటీసు ఇచ్చారు. ఇంతకి ఏమిటంటే బడాబాబులు సాగు చేస్తున్న పక్కనే ఉన్న 150 ఎకరాల్లోని చేపల చెరువులకు సీపేజీ (ఊటబోదె) లేదు. జిల్లాలో సాగుతున్న దాదాపు 70 శాతానికిపైగా చెరువులకు సీపేజీ లేదంటే అతిశయోక్తి కాదు. కావాలని 2024 ఆగస్టు నుంచి రైతులను ఇబ్బందులు పెడుతూ చెరువులో ఎటువంటి సాగూ జరగకుండా నిలిపివేశారు.

ప్రభుత్వ భూమి ఉన్న చెరువులో దర్జాగా సాగు.. చోద్యం చూస్తున్న అధికారులు

పక్కనే ఉన్న పెద్ద చేపల చెరువులో 159-4లో 94 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. 2015 మధ్యకాలంలో ఇది ప్రభుత్వ భూమిగా గుర్తించి రెవెన్యూ అధికారులు చెరువును నిలుపుదల చేశారు. ఇప్పుడు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న చేపల చెరువుల్లో దర్జాగా చేపల సాగు సాగుతుండగా చిన్న, సన్నకారు రైతుల చెరువుల్లో మాత్రం సాగు నిలిపివేశారు. దీనిపై బాధిత రైతులు రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులకు అనేక ఫిర్యాదులు చేసినప్పటికీ సరైన స్పందన లేకుండాపోయింది. అతికష్టం మీద కొంతమందికి నోటీసులు జారీ చేసి మమ అనిపించేశారు. ఎఫ్‌డిఒ తనకు సంబంధం లేని అంశాల్లో సైతం జోక్యం చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా నీటి హక్కుల గురించి ప్రస్తావించడం దుర్మార్గపు చర్యలకు పరాకాష్టగా చెప్పొచ్చు. ప్రభుత్వ భూమిలో చేప పిల్ల వేయకుండా అడ్డుకుంటామంటూ వెళ్లిన రెవెన్యూ అధికారులు ఆర్ఐ, విఆర్ఒలు సైతం బడాబాబులకు వంతపాడుతూ వెనక్కివచ్చినట్లు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారులకు భారీగా ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మత్స్యశాఖ ఎఫ్‌డిఒ చర్యలను కట్టడిచేయాల్సిన తహశీల్దార్ ఆధ్వర్యంలోని మండల కమిటీ సైతం సరిగా స్పందించడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. రెవెన్యూ, జిల్లా మత్స్యశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు మత్స్యశాఖ కమిషనర్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. దీంతో నిడమర్రు మండల ఎఫ్‌డిఒపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలంటూ జిల్లా మత్స్యశాఖ అధికారులకు ఆదేశాలు వచ్చాయి. విచారణ ఏవిధంగా చేస్తారో వేచిచూడాల్సి వచ్చింది. దాదాపు ఏడాది కాలంగా చెరువు సాగు నిలిచిపోవడంతో సన్నకారు రైతులు రూ.ఏడు లక్షలకుపైగా నష్టపోయిన పరిస్థితి ఉంది. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని జిల్లా కమిటీ దీనిపై జోక్యం చేసుకుంటే తప్ప సదరు రైతులకు న్యాయం జరిగే పరిస్థితి కనిపించడం లేదు. మరింత లోతైన విచారణ చేస్తే మత్స్యశాఖలో జరుగుతున్న దందా గురించి మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఎఫ్‌డిఒపై విచారణకు ఆదేశాలు వచ్చాయి

బి. నర్సయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి, ఏలూరు జిల్లా

నిడమర్రు మండల ఎఫ్‌డిఒకు సంబంధించిన విషయాలు నా దృష్టికి వచ్చాయి. ప్రభుత్వ భూమికి సంబంధించి రెవెన్యూ అధికారులు గుర్తించిన రైతుల మేరకు నోటీసులు ఇవ్వడం జరిగింది. నోటీసులు సైతం సరిగా ఇవ్వలేదని రైతులు చెబుతూ రాష్ట్ర ఉన్నతాధికారులకు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఎఫ్‌డిఒపై విచారణ చేస్తాం. విచారణాధికారిగా కైకలూరు ఎడి రాజకుమార్‌ను నియమించాం. పది రోజుల్లో విచారణ పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు ఉన్నాయి.



గురజలో జోరుగా నీటి చౌర్యం..!

- మోటార్లతో చేపల చెరువులకు నీరు తోడేస్తున్న ఆక్వా రైతులు
- శివారు గ్రామాల తాగునీటి చెరువులకు అందని నీరు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి



మండలంలో తాగునీటి చౌర్యం జోరుగా సాగుతోంది. తాగునీటి చెరువుల్లో నింపాల్సిన నీటిని ఆక్వా రైతులు దారి మళ్లించి చేపల చెరువులు నింపుకుంటున్నారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం కాలువలకు నీటిని విడుదల చేసింది. అయితే కాలువల ద్వారా ప్రవహిస్తున్న నీరు తాగునీటి చెరువులకు కాదు, ఆక్వా చెరువులకే అన్నట్లుగా ఆక్వా రైతులు నీటి చౌర్యానికి పాల్పడుతున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినప్పటికీ తమకేం తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ తంతు అంతా ముదినేపల్లి మండలంలో వారం రోజులుగా జరుగుతోంది.

మండలంలోని పోల్రాజ్ కెనాల్ పరిధిలో గురజ, పెనుమల్లి, ముదినేపల్లి, చిగురుకోట తదితర గ్రామాల్లో ఆక్వా రైతులు తాగునీటిని చేపల చెరువులకు మళ్లిస్తున్నారు. గ్రామాల్లోని ప్రజల దాహార్తిని తీర్చేందుకు పంట కాలువల ద్వారా ప్రవహిస్తున్న తాగునీటిని ఆక్వా రైతులు దారి మళ్లిస్తూ మోటార్లతో ఇష్టానుసారం నీటి చౌర్యానికి పాల్పడుతున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. రాత్రింబవళ్లు ఆక్వా రైతులు కాలువలోని నీటిని విద్యుత్ మోటార్లతో తోడేస్తున్నారు. దీంతో మండల శివారు, నియోజకవర్గ శివారు గ్రామాలకు తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా గురజ డిస్ట్రిబ్యూషన్ పాయింట్ నుంచి (డిపి) తాగునీటి చెరువులకు వెళ్తున్న నీటిని అడ్డకట్ట తొలగించి ఆక్వా రైతులు అన్నవరం పరిధిలోని చేపల చెరువులకు మళ్లించుకుంటున్నారు. గురజ గ్రామానికి చెందిన పలువురు రైతులు మాట్లాడుతూ తాగునీటి చెరువులకు వెళ్తున్న నీటిని అడ్డు తొలగించి చేపల చెరువులకు తోడేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో కాలువ తూముల షట్టర్లు ఎత్తేసి నీటిని ఆక్వా చెరువులకు తరలించుకుపోతున్నట్లు ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు. నీటి చౌర్యం జరగకుండా అధికారులు పోలీస్, సచివాలయం, రెవెన్యూ సిబ్బందిని ఏర్పాటు చేసినప్పటికీ ఈ టీములు ఎక్కడా కాలువ గట్లపై కనిపించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి తాగునీటిని చేపల చెరువులకు మళ్లిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. ఈ విషయమై డిఎల్‌పిఒ భరత్ చంద్రను వివరణ కోరగా తాగునీటి చెరువులు నింపేలా చర్యలు చేపడతామన్నారు. తాగునీటిని ఆక్వా చెరువులకు మళ్లించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

పాఠశాల బస్సులకు ఫిట్‌నెస్ లేకుంటే చర్యలు

అందరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి
జిల్లా ఉప రవాణా కమిషనర్ (డిటిసి) షేక్ కరీం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మే 15 తర్వాత ఫిట్‌నెస్ లేని ఏ పాఠశాల బస్సు అయినా రోడ్లపై తిరిగితే సీజ్ చేస్తామని, పాఠశాల యాజమాన్యాలపై కూడా చర్యలు తీసుకుంటామని జిల్లా ఉప రవాణా కమిషనర్ (డిటిసి) షేక్ కరీం హెచ్చరించారు. పాఠశాలల బస్సులు ఎప్పుడూ ఫిట్‌గా ఉండేలా యాజమాన్యాలు తీసుకోవాలని సూచించారు. లేకపోతే చర్యలు తప్పవని చెప్పారు. ఆయనతో ప్రజాశక్తి ముఖాముఖి...

ప్రశ్న : పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కాలం ముగుస్తుండడంతో ప్రత్యేక చర్యలు ఏమైనా తీసుకుంటున్నారా?

డిటిసి : జిల్లా వ్యాప్తంగా 1,130 బస్సులు పాఠశాలల బస్సులుగా ఉప రవాణా కమిషనర్ కార్యాలయ లెక్కల్లో ఉన్నాయి. అయితే వీటిలో 15 ఏళ్ల దాటిన బస్సులు (కాలం చెల్లినవి) పాఠశాల బస్సులుగా నడిపేందుకు అర్హత కోల్పోతాయి. వాటికి గ్రీన్ ట్యాక్స్ చెల్లించి పారిశ్రామిక సంస్థలకు ఇతర ప్రయివేట్ ట్రావెల్స్‌లకు తిరిగేందుకు మాత్రమే అనుమతి ఉంది. 15 ఏళ్ల దాటిన పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ జారీ చేసేందుకు అవకాశాలు లేవు. అటువంటి బస్సులు ఏవైనా రోడ్లపై తిరిగితే వాటిని సీజ్ చేసి పాఠశాల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేస్తాం. మే 15 తర్వాత ఏ పాఠశాల బస్సు ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపై తిరిగేందుకు అనుమతులు లేవు.

ప్రశ్న : వాహనాలకు సంబంధించి ప్రత్యేక తనిఖీలు ఏమైనా చేస్తున్నారా?

డిటిసి : ప్రతిరోజు జిల్లా వ్యాప్తంగా వాహనాలకు సంబంధించిన ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఈ ప్రత్యేక తనిఖీల్లో ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ట్యాక్స్ పెండింగ్‌లో ఉన్న వాహనాలను గుర్తించి జరిమానాలు విధిస్తున్నాం. సరైన పత్రాలు లేకుండా తిరుగుతున్న వాహనాలపై కూడా కేసులు నమోదు చేస్తున్నాం.

ప్రశ్న : వాహనాలకు విధించే జరిమానాల్లో ఏమైనా మార్పులు చోటు చేసుకున్నాయా?

డిటిసి : రవాణా శాఖలో వాహనాలకు విధించే జరిమానాల్లో ఎటువంటి మార్పు లేదు. అయితే పోలీస్ శాఖలో ఉన్న అప్లికేషన్‌లో కొంతకాలం క్రితమే ఈ జరిమానాలు అప్‌డేట్ అయ్యాయి. హెల్మెట్ లేకుండా వాహనాన్ని నడిపితే రూ.వెయ్యి నుంచి రూ.ఐదు వేల వరకు జరిమానా ఉంటుంది. ఇన్సూరెన్స్ లేకుండా ద్విచక్రవాహనాలు నడిపితే రూ.1,500 నుంచి రూ.ఐదు వేల వరకు, సీట్ బెల్ట్ లేకుండా కారు నడిపితే రూ.వెయ్యి వరకు, కార్లకు ఇన్సూరెన్స్ లేకుండా నడిపితే రూ.రెండు వేల నుంచి రూ.పది వేల వరకు జరిమానా ఉంటుంది. జరిమానాలను దృష్టిలో ఉంచుకుని వాహనదారులు కచ్చితంగా సరైన పత్రాలు కలిగి ఉండాలి. వాహనదారులకు ఇప్పటికే అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఆటో డ్రైవర్లకు ప్రత్యేకంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా పరిమితికి మించి ప్రయాణికులను తరలించే బస్సులపై, ఆటోలపై కేసులు నమోదు చేసేందుకు స్పెషల్ డ్రైవ్స్ కూడా నిర్వహిస్తున్నాం.



ప్రశ్న : ఇన్సూరెన్స్ లేకుండా వాహనాలను నడిపితే వాహనదారులు ఎదుర్కొనే ఇబ్బందులు ఏమిటి?

డిటిసి : ఇన్సూరెన్స్ లేకుండా వాహనాన్ని నడిపితే వాహనం ప్రమాదానికి గురైనప్పుడు ఆ పూర్తి నష్టాన్ని వాహన యజమాని భరించాల్సి ఉంటుంది. అంతేకాకుండా వాహనం ప్రమాదానికి గురైనప్పుడు మూడో వ్యక్తి పాక్షికంగా వికలాంగుడైనా లేదా మృతి చెందినా అతనికి చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని మొత్తం వాహన యజమాని ఇవ్వాల్సి ఉంటుంది. వాహనానికి ఇన్సూరెన్స్ ఉన్నప్పటికీ వాహనాన్ని నడిపే వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే అసలు ప్రయోజనమే లేదు. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే వాహనం నడిపిన సమయంలో ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి వాహనానికి ఇన్సూరెన్స్ వర్తించదు. ఆటో డ్రైవర్లు, కార్లు, రవాణా బస్సులు కచ్చితంగా ఇన్సూరెన్స్ కలిగి మాత్రమే వాహనాలను నడపాలి.

ప్రశ్న : ఈ ఏడాది వాహన తనిఖీల్లో నిర్దేశించిన టార్గెట్‌ను జిల్లా రవాణా కార్యాలయం పూర్తి చేసిందా లేదా?



డిటిసి : 2024-2025 ఫైనాన్షియల్ ఇయర్‌కు జిల్లాకు రూ.196 కోట్లు టార్గెట్ నిర్దేశించగా రూ.157 కోట్లతో 80 శాతం సాధించగలిగాం. ప్రతి హెడ్‌లో 85 శాతం వరకు సాధించాం. ఒక్క డిటెక్షన్ హెడ్‌లో టార్గెట్ అధికంగా రూ.20 కోట్లు ఇచ్చారు. చెక్‌పోస్టులు తీసేయడంతో రూ.ఆరు కోట్ల ఆదాయం కోల్పోయాం. గతేడాది 2023-2024లో మొత్తం రూ.పది కోట్లు సాధించాం. అందులో రూ.ఆరు కోట్లు చెక్‌పోస్ట్ నుంచి వచ్చాయి. మిగతా రూ.నాలుగు కోట్లు జిల్లా నుంచి వసూలు చేయగలిగాం. ఇప్పుడు చెక్‌పోస్ట్ లేకుండానే రూ.ఆరు కోట్లు సాధించగలిగాం. చెక్‌పోస్ట్ ఉండి ఉంటే రూ.12 కోట్ల వరకు ఆదాయం సాధించేవాళ్లం. ఆరు నెలలు ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ రూ.రెండు కోట్లు సాధించగా తాను ఉప రవాణ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్టోబర్ నుంచి మార్చి 2025 వరకు రూ.నాలుగు కోట్లు సాధించగలిగాం. మొదటి ఆరు నెలల్లో మూడు వేల కేసులు నమోదు చేయగా తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత రూ.14,500 కేసులు నమోదు చేశాం.

ప్రశ్న : రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమైనా ఉన్నాయా?

డిటిసి : ప్రతి పౌరుడూ ప్రతి వాహనదారుడూ రోడ్డు భద్రత నియమాలను వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించినప్పుడు మాత్రమే పూర్తిస్థాయిలో ప్రమాదాలు అరికట్టే పరిస్థితికి జిల్లా అయినా రాష్ట్రమైనా చేరుకుంటుంది. వాహనదారుల్లో రోడ్డు భద్రత నియమాలపై సరైన అవగాహన లేకపోవడం, వాటిని పాటించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుని ఎంతోమంది మృత్యువాత పడుతున్నారు. క్షతగాత్రులుగా, పాక్షిక వికలాంగులుగా మిగులుతున్నారు. రోడ్డు ప్రమాదాల రహిత జిల్లాగా చూడాలంటే కచ్చితంగా ప్రతి పౌరుడూ రోడ్డు భద్రత నియమాలను వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలి. ఇందులో భాగంగానే ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడం, కార్లను నడిపేవారు సీటు బెల్టు ధరించడం, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకుండా ఉండడం వంటివి కచ్చితంగా చేయాలి. ఇవి చేస్తే 30 శాతం ప్రమాదాలను తగ్గించే అవకాశం ఉంటుంది. ఇక మైనర్లు వాహనాలను నడిపి అనేక ప్రమాదాలకు కారకులవుతున్నారు. మోటర్ వాహనం చట్టం 1988లో కొత్తగా పొందుపరిచిన సెక్షన్ 199ఎ ప్రకారం మైనర్లు వాహనాలు నడిపేందుకు తల్లిదండ్రులు అనుమతించినా, తల్లిదండ్రుల ప్రమేయం లేకుండా వారు వాహనాలను నడిపినా లేదా వారు తమ వాహనాలతో వేరొకరి వాహనాన్ని ప్రమాదానికి గురయ్యేలా చేసినా కచ్చితంగా మైనర్ల తల్లిదండ్రులు శిక్షార్హులవుతారు. మైనర్ చట్టం ప్రకారం మైనర్లపై కేసు నమోదు చేస్తే వారి తల్లిదండ్రులకు రూ.ఐదు వేల జరిమానాతో పాటు నెల నుంచి మూడు నెలల వరకు జైలు శిక్ష విధిస్తారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు వాహనాలను వారి పిల్లలకు ఇవ్వకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. హెల్మెట్‌పై అవగాహనా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా ఏలూరు నగరంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఇంజినీరింగ్ కళాశాలల ప్రాంగణాల్లో హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాం. కలెక్టర్ వెట్రిసెల్వి ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద రవాణా శాఖ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి నో హెల్మెట్ నో ఎంట్రీ పేరుతో అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు కూడా అవగాహన పెంచుకుని రోడ్డు భద్రత నియమాల్లో వారు కూడా భాగస్వాములై వారి వారి కుటుంబాల్లో విషాదాలు నింపకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ వాహనాలను నడిపి క్షేమంగా ఇళ్లకు వెళ్లాలని జిల్లా ఉప రవాణ కమిషనర్ కార్యాలయం నుంచి ప్రజలకు విన్నవిస్తున్నాం. వాహనంపై బయలుదేరిన వాహనదారుడు తిరిగి క్షేమంగా తమ తమ ఇళ్లకు వెళ్లాలనే ఒకే ఒక లక్ష్యంతో జిల్లా ఉప రవాణా కమిషనర్ కార్యాలయ సిబ్బంది పని చేస్తున్నారు.

పహల్గాం దోషులను కఠినంగా శిక్షించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - టి.నరసాపురం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

పహల్గాం ఉగ్రదాడికి కారకులైన, అనేక మంది ప్రాణాలు బలి తీసుకున్న వారిని కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ టి.నరసాపురంలోని మసీదు వద్ద ఆదివారం జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవి మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రక్షణ వ్యవస్థను గాలికి వదిలేసిందని, అందుకే ఉగ్రమూకలు చొరబడడానికి దారి దొరికిందని తెలిపారు. ఒక ఊరు నుంచి మరో ఊరికి వెళ్లడానికి 100 రకాల పర్మిషన్లు అడిగే ప్రభుత్వాలు, ఉగ్రవాదులు చొరబడుతుంటే ఏం చేస్తున్నారని విమర్శించారు. ఉగ్రవాదుల చొరబాటుకు, మాదకద్రవ్యాల రవాణాకు బిజెపి ప్రభుత్వం తలుపులు తెరుస్తోందని విమర్శించారు. మరో పక్క వక్ఫ్ చట్టం ద్వారా వక్ఫ్ ఆస్తులను దోచుకోవడానికి ప్రయత్నిస్తోందని, బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలతో దేశ ప్రజల్లో అశాంతిని సృష్టించడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. అనంతరం ముస్లిం పెద్దలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అనుమల మురళి, గుడెల్లి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లో ముమ్మర తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్



తనిఖీలు చేస్తున్న రైల్వే పోలీసులు

రైల్వే రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏలూరు రైల్వేస్టేషన్లో ముమ్మర తనిఖీలు నిర్వహించామని విజయవాడ ఏరియా రైల్వే డిఎస్‌పి జి.రత్నరాజు తెలిపారు. ఏలూరు నగరంలోని పెద్ద రైల్వే స్టేషన్‌లో జిఆర్‌పి పోలీసులు ఆర్‌పిఎఫ్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నేరుగా విజయవాడ ఏరియా రైల్వే డిఎస్‌పి రత్నరాజు పాల్గొన్నారు. ఇందులో భాగంగా స్టేషన్లో బుకింగ్ కౌంటర్, పార్సెల్ కౌంటర్ ఫ్లాట్‌ఫామ్‌ను తనిఖీ చేశారు. అలాగే ప్రయాణికుల బ్యాగులను కూడా తనిఖీ చేశారు. ప్రయాణికులు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళుతున్నారన్న వివరాలు కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రత్నరాజు మాట్లాడుతూ విజయవాడ రైల్వే ఎస్‌పి రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాలతో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. జిఆర్‌పి పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ పోలీసులు సంయుక్తంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో విజయవాడ ఏరియా సిఐ దుర్గారావు, పలువురు రైల్వే పోలీసులు పాల్గొన్నారు.

ఆక్రమణ చెరలో పెంట్లమ్మ చెరువు

పది ఎకరాల్లో సగంపైగా కబ్జా

ప్రజాశక్తి - ఉంగుటూరు



ఆక్రమణలకు గురవ్వగా మిగిలిన చెరువు ఇదే

నాచుగుంట పంచాయతీ పరిధి సర్వే నెంబర్ 90లో పెంట్లమ్మ చెరువు కబ్జాకు గురైంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం పది ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన ఈ చెరువు సగానికి పైగా పెత్తందారులు, భూకబ్జాదారుల కబంధ హస్తాల్లో ఉంది. నాచుగుంట రెవెన్యూకు చెందిన ఈ చెరువు వెంకటరామన్నగూడెం హార్టికల్చర్ విశ్వవిద్యాలయం, ఉంగుటూరు అటవీ భూమి సమీపంలో ఉంది. పూర్తిగా వర్షాధారంతో ఈ చెరువులో చేపల పెంపకం ద్వారా పంచాయతీకి ఆదాయం రావాల్సి ఉంది. 2022లో బహిరంగ వేలం పాట నిర్వహించగా రూ.మూడు లక్షలకు ధర పలికింది. రానున్న జూన్ నెలతో పాట గడువు పూర్తి కానుంది. మళ్లీ కొత్తగా పాట నిర్వహించాల్సి ఉంది. చెరువులో ఆక్రమణలు తొలగిస్తే పాట పెరిగి పంచాయతీకి ఆదాయం వచ్చేదని, ఇప్పటికైనా చెరువు హద్దులు సర్వే చేసి ఆక్రమణలను తొలగించి పంచాయతీకి ఆదాయ వనరులు పెంచేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. సర్వే చేయించి హద్దు నిర్ధారించి చెరువుకు పూర్వవైభవం వచ్చేలా చర్యలు తీసుకోనున్నామని పంచాయతీ కార్యదర్శి నీలం ప్రసాద్ వెల్లడించారు. ఈ వేసవిలో చెరువును అభివృద్ధి చేసేందుకు ఆలోచన చేస్తున్నామని సర్పంచి ఏలేటి సునీత చెప్పారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : ఎఎస్‌పి సూర్యచంద్రరావు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే బాధ్యత విద్యార్థులపైనే ఉందని జిల్లా అదనపు ఎస్‌పి సూర్యచంద్రరావు అన్నారు. నగర శివారులోని దుగ్గిరాల ప్రాంతంలో ఉన్న డెంటల్ కళాశాలలో సంవత్సరాంతపు 19ఎ బెటాలియన్ ఎన్‌సిసి క్యాంపు ముగింపు కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాలపై ఆదివారం అవగాహనా కార్యక్రమాన్ని ఎన్‌సిసి అధికారులు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు ఎస్‌పి సూర్యచంద్రరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్‌సిసి విద్యార్థులంటే మిగతా విద్యార్థులకు భిన్నంగా వారు దేశం కోసం పోరాడే సైనికుల్లో ఉండే కొన్ని అంశాలను తెలుసుకుంటూ ఉంటారన్నారు. అలాగే మీరు కూడా దేశ భవితవ్యాన్ని రక్షించే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



మేడే వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

మేడే స్ఫూర్తితో లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాడాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు

ప్రజాశక్తి - నిడమర్రు

మేడే స్ఫూర్తితో నాలుగు లేబర్ కోడ్‌ల పోరాడాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు పిలుపునిచ్చారు. మండలంలోని భువనపల్లి గ్రామంలో సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో మేడే పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నారపల్లి రమణారావు మాట్లాడుతూ పోరాడి సాధించుకున కార్మిక చట్టాలు, ఎనిమిది గంటల పనిని రక్షించుకోవాలన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణ పేరుతో కార్పొరేట్లకు అనుకూలంగా కార్మికులకు నష్టం కలిగించేలా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వాటిని రద్దు చేసేవరకూ కార్మికులందరూ మేడే స్ఫూర్తితో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిలి నాని, జోరిగే నాగబాబు, కోనా శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, గారపాటి పెద్దకాపు, కోడూరి పెదకాపు, కె.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సైన్స్ పరికరాలు అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశంతో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ సౌజన్యంతో సైన్స్ పరికరాలు అందించడం ఆనందదాయకమని ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సుమారు రూ.నాలుగు లక్షల విలువైన రసాయనిక, భౌతిక శాస్త్ర పరిజ్ఞానం గల పరికరాలను అందించారు. ఈ పరికరాలు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాశం నాగబాబు, షకీలా, అనురాధ, గౌరీ శంకర్, సుజాత, వాసు, నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేతన్న నేస్తం పథకాన్ని పునరుద్ధరించాలి

చేనేత కార్మిక సంఘం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నేతన్న నేస్తం పథకాన్ని పునరుద్ధరించి చేనేత కార్మికులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక శనివారపుపేట వీవర్స్ కాలనీలో సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగా చేనేత కార్మికులు ఉపాధి పోయి వీధిన పడుతున్నారన్నారు. అటువంటి కార్మికులను ఆదుకోవాలని, మగ్గం నేస్తున్న ప్రతి చేనేత కార్మికుని కుటుంబానికి నెలకు రూ.రెండు వేల చొప్పున జీవన భృతి ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మత్స్యకారులకు రూ.1,29,078 మందికి రెండు నెలల వేట నిషేధ సమయంలో ఇస్తున్న జీవన భృతి రూ.పది వేల నుంచి రూ.20 వేల వరకు పెంచి ఇవ్వడంపై చేతి వృత్తిదారుల జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పేరక చిన్న వెంకటేశ్వరరావు, ఎర్ర సాంబశివరావు, గుత్తి పోతురాజు, పగడాల నాగరాజు, గుత్తి దుర్గాకుమారి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - ముసునూరు

నష్టపోయిన బాధిత కుటుంబాలను అట్లూరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆదుకుంటుంది. మండలంలోని చెక్కపల్లి గ్రామంలో బిసి ఏరియాలో పేరం సుబ్బారావుకు చెందిన ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది విషయం తెలుసుకున్న అట్లూరి ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత అట్లూరి వెంకట రవీంద్ర ఆ కుటుంబానికి ఆర్థిక సాయం, బట్టలు, వంట సామన్లు, 25 కేజీల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో చెక్కపల్లి గ్రామ సర్పంచి తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, కాటేపల్లి పెద్దబాబు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కందుల పిచ్చియ్య, లక్క పాము కాంతారావు, మామిడి చిట్టి గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



సామగ్రి అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

రెడ్డి అప్పలనాయుడుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని డాక్టర్ ఎంఆర్ అప్పారావు కాలనీలో ఎపిఎస్‌ఆర్‌టిసి విజయవాడ రీజనల్ బోర్డు ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడును ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్మిక సంఘ నాయకుడు దేవుడు మాట్లాడుతూ కార్మిక వర్గం కష్టం తెలిసిన వ్యక్తిగా ప్రభుత్వాలు ఇచ్చే సంక్షేమ పథకాలను అమలు జరిగేలా అప్పలనాయుడు చూడాలని కోరారు. అప్పలనాయుడుకు కార్మిక వర్గం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కన్వీనర్ బర్మా ఫణిబాబు, నాయకులు బొబ్బిలి శ్రీకాంత్, కార్మికులు దేవుడు, రమేష్, సాయి, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నకిలీ ఉత్పత్తుల విక్రయాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

తమ కంపెనీకి చెందిన నకిలీ ఉత్పత్తులను ఏలూరు ఒకటో పట్టణ పరిధిలో అమ్మకాలు సాగిస్తున్నారని ఫెవికాల్ కంపెనీ ప్రతినిధి పునీత్ డిగ్రీ ఏలూరు ఒకటో పట్టణ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఏలూరు వన్‌టౌన్ పరిధిలోని లక్ష్మీ ప్రసన్న జనరల్ స్టోర్స్‌లో తాను నకిలీ ఫెవికాల్ ఉత్పత్తులు గుర్తించానని ఈ ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. ఇటువంటి ఉత్పత్తులను నిరోధించాలని ఆయన కోరారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఫ్యాన్‌కు ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మతి చెందిన సంఘటన మండలంలోని తిరుపతిపాడులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వల్లంపట్ల పంచాయతీలోని తిరుపతిపాడు గ్రామానికి చెందిన నులకానికి పూర్ణ సాయిపవన్ (22) పదో తరగతి వరకు చదివి చదువు మాని వ్యవసాయం, ట్రాక్టర్ పనులకు వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో ప్రతి రోజు రాత్రి వేళల్లో ఇంటికి ఆలస్యంగా వస్తున్నాడని తండ్రి సిద్ధిరాజు మందలించడంతో మనస్తాపానికి గురైన సాయి పవన్ ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి జ్యోతి ఫిర్యాదుతో ఎస్ఐ ఎం.జయబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్ననట్లు తెలిపారు.

ఎటిఎంలో నగదు కాజేసేందుకు విఫలయత్నం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఎటిఎం పగలగొట్టి నగదు కాజేసేందుకు వ్యక్తి ప్రయత్నించి విఫలం కావడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటన నగరంలోని ఒకటో పట్టణ పరిధిలో చోటు చేసుకుంది. నగరంలోని విజయలక్ష్మి థియేటర్ సమీపంలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఎటిఎం ఉంది. ఆ ఎటిఎం వద్ద సెక్యూరిటీ లేకపోవడంతో గుర్తు తెలీని వ్యక్తి ఎటిఎంలోకి దానిని పగలగొట్టేందుకు విశ్వ ప్రయత్నం చేశాడు. ఎటిఎంను పగలగొట్టినప్పటికీ అందులోంచి నగదు మాత్రం బయటికి రాలేదు. దీంతో అక్కడి నుంచి అతను వెళ్లిపోయాడు. ఈ ఘటనపై ఏలూరు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాలు తనిఖీ చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని కాకరవాడ గ్రామ పరిధిలో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వీరభద్రుడు తెలిపారు. గ్రామంలోని పంట కాలవ గట్టు దగ్గర పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4,500 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నియోజకవర్గ క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలను బుట్టాయగూడెంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులతో కలిసి సరదాగా కాసేపు క్రికెట్ ఆడారు. ఈ క్రికెట్ పోటీల్లో మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.35 వేలు, మూడో బహుమతి రూ.20 వేలుగా నిర్ణయించారు. ఆదివారం ప్రారంభమైన ఏజెన్సీ ప్రీమియర్ లీగ్‌లో మొదటి మ్యాచ్ సన్ రైజర్స్ కన్నాపురం, బుట్టాయగూడెం ఇండియన్స్ జట్ల మధ్య జరగగా సన్‌రైజర్స్ కన్నాపురం జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్ రాయల్ ఛాలెంజ్ ఏజెన్సీ, టి.నరసాపురం క్యాపిటల్స్ జట్ల మధ్య జరగగా రాయల్ ఛాలెంజ్ ఏజెన్సీ జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో లక్ష్మడుగూడెం పంచాయతీ సర్పంచి మడకం రామలక్ష్మి, బుట్టాయగూడెం పంచాయితీ సర్పంచి తెల్లం వెంకాయమ్మ పాల్గొన్నారు.

పేద విద్యార్థికి మానవత సాయం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మానవత ఉంగుటూరు మండల శాఖ సమావేశం ఆదివారం నారాయణపురంలో అధ్యక్షులు వేగ్నేశ రంగరాజు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా మానవత రాష్ట్ర విస్తరణ కమిటీ కన్వీనర్ సాగిరాజు జానకీరామరాజు విచ్చేశారు. సమావేశంలో కైకరానికి చెందిన చల్లా కృపా ఏంజెల్‌కు ఫీజు కట్టే నిమిత్తం రూ.పది వేలు అందించారు. ముందుగా పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. అలాగే రానున్న సంవత్సరానికి నూతన కమిటీ ఏర్పాటు గురించి చర్చించారు. ఈ సమావేశంలో రీజియన్ ఛైర్మన్ పుప్పాల గోపీ, కార్యదర్శి గంజి రవికుమార్, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, పూర్వ అధ్యక్షులు వేగ్నేశ సూర్యనారాయణరాజు, పుసులూరి ప్రకాష్, సీతాల సత్యనారాయణ, బొమ్మిడి అప్పారావు, పాతురి వంశీ, రామిరెడ్డి వెంకటరెడ్డి, సతీష్, ప్రతాప్, నిమ్మల బాబూరావు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి రూ.2.2 లక్షలు విరాళం

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని కోరుకొల్లు గొల్లగూడెం కోదండరామాలయం ప్రహరీ నిర్మాణానికి వర్రే వెంకట సత్యనారాయణ, నీరజ (యుఎస్ఎ) దంపతులు రూ.2,02,440 విరాళంగా అందించారు. ఇందుకు సంబంధించిన చెక్కును ఆదివారం అందించినట్లు వర్రె జగన్నాథం ఛారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి చెన్నంశెట్టి కృష్ణ తెలిపారు. గ్రామాభివృద్ధికి వెంకట సత్యనారాయణ, నీరజ దంపతులు పలు మార్లు వివిధ కార్యక్రమాలకు విరాళాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ చీకటి లక్ష్మణరావు, సరళ, అముజాల బాబు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డ్రెయినేజీలో పూడిక తీయరూ..!

ఎర్రగుంటపల్లి వాసుల వేడుకోలు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - చింతలపూడి

డ్రెయినేజీ పూడికలు తీయకపోవడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీ నిండిపోయి రోడ్డుపైకి బురద వస్తుందని, దీంతో దోమలు బెడదా ఎక్కువైందని వారు వాపోతున్నారు. రాత్రి సమయంలో దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని చెబుతున్నారు. ఎస్‌సి ఏరియాలోకి వచ్చి తాము పడుతున్న ఇబ్బందులను చూసి సమస్యను పరిష్కరించాలని పంచాయతీ అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 రోజుల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా స్పందించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి డ్రెయినేజీ పూడిక తీయించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



పూడిక తీయని డ్రెయినేజీ

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి
రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే ఆర్థిక సాయాన్ని కూటమి ప్రభుత్వం రెట్టింపు చేసి విడుదల చేసిందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూరిందని తెలిపారు. మత్స్యకార గ్రామాలు టిడిపికి అండగా నిలబడ్డాయని, వెనుకబడిన తరగతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని పేర్కొన్నారు. సముద్రంలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులు ఇబ్బందులు పడకుండా ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయాన్ని రూ.పది వేల నుంచి రూ.20 వేలకు పెంచామని తెలిపారు. ప్రజలందరికీ సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. గత పాలకులు ఫిష్ ఆంధ్ర పేరుతో రూ.300 కోట్లు ఖర్చు పెట్టినా ఒక్క మత్స్యకారుని కుటుంబానికి కూడా మేలు జరగలేదని పేర్కొన్నారు. 2014లో తొలిసారిగా తెలుగుదేశం ప్రభుత్వమే వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశ పెట్టిందని, 2014-2019 మధ్య మత్స్యకారుల సంక్షేమం కోసం రూ.788 కోట్లు తమ ప్రభుత్వం ఖర్చు పెట్టిందని, అంతేకాకుండా వలలు, పడవలు, ఐస్ బాక్సులు అదనంగా ఇచ్చామని తెలిపారు. రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు నెలనెలా పింఛన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. మత్స్యకారులు చేపల వేట సమయంలో మరణిస్తే రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లిస్తున్నామని, వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ.తొమ్మిది రాయితీ ఇస్తున్నామని తెలిపారు. కొల్లేరు మండలాల్లోని కేవలం చేపల వేటపై జీవనం సాగించే ఎంతోమంది మత్స్యకారులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపారు.

చేపల ఎగుమతుల్లో ఎపి టాప్

రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలున్నాయని, చేపల ఎగుమతుల్లో మన రాష్ట్రం ముందు వరుసలో ఉందని పేర్కొన్నారు. దేశంలో ఉత్పత్తయ్యే మత్స్యసంపదలో 29 శాతం మన రాష్ట్రం నుంచే ఉంటుందని తెలిపారు. ఎపి నుంచే 32 శాతం మత్స్య సంపద ఎగుమతులు జరుగుతున్నాయని, మత్స్య ఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. చేపల పెంపకం వల్ల ఎన్నో లాభాలున్నాయని, వీటి ద్వారా శరీరానికి ప్రొటీన్ అధికంగా అందుతుందని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే చేపలు వినియోగం పెరగాలని పేర్కొన్నారు.

శ్రీవారి సన్నిధిలో మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని రాష్ట్ర గనుల, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం వేద పండితులు వేదమంత్రోచ్చరణ చేసి ఆశీర్వదించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందించారు. మంత్రితో పాటు గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు, పీతల సుజాత, ఆచంట సునీత ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు జిల్లా పరిషత్ హైస్కూల్ పూర విద్యార్థులు (2005-2006 పదో తరగతి బ్యాచ్) ఆదివారం పాఠశాలలో సమ్మేళనమయ్యారు. విద్యార్థు లందరూ ఒకరినొకరు ఎంతో అప్యాయంగా పలకరించుకుని చిన్ననాటి మధుర స్మృతులను తలుచుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు దీవెనమ్మ, జీవ శాస్త్ర ఉపాధ్యాయులు డిఆర్‌కె.ప్రసాద్, గణిత ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, ఫిజికల్ డైరెక్టర్ పి.రవీంద్రలను ఘనంగా సన్మానించారు. స్కూల్ స్టాఫ్ సెక్రటరీ గంగుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మధుర గీతాలు, జోక్స్, పలకరింపులు చేసుకుంటూ ఆట పాటలతో సరదాగా గడిపారు. యాంకర్‌గా సుకుమార్ వ్యవహరించారు. సుదూరు ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు కొడవలి శ్రీను, మహేష్, తాయారు, మధు చంద్రిక, రామలక్ష్మిలు మాట్లాడుతూ చిన్న నాటి స్నేహితులను కలసుకున్నందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ అందరూ ఇలా ఎప్పుడూ సంతోషముగా ఉండాలని, సరదాగా గడపాలని, కుటుంబ భాధ్యతలు గుర్తు పెట్టుకుని సంతోషంగా ఉండాలని ఒకరికొకరు సహాయం చేసుకోవాలని చెప్పారు.



పాఠశాలలో పూర్వ విద్యార్థులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

20న సమ్మెను జయప్రదం చేయాలి
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్

ప్రజాశక్తి - కుక్కునూరు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మే 20వ తేదీన దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులంత పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ పిలుపునిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో పాత దాచారంలో డివిజన్ స్థాయి శిక్షణా తరగతులను ఆయన ఆదివారం జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ తరగతులకు ముఖ్య అతిథిగా డిఎన్‌విడి.ప్రసాద్ హాజరై సిఐటియు విశిష్టత, నిర్మాణం, దేశ వ్యాప్త సమ్మెపై క్లాసు బోధించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బ్రిటిష్ కాలంలో పోరాడి సాధించుకున్న 29 కార్మికుల చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గానికి తీవ్రమైన అన్యాయం చేయాలని చూస్తుందన్నారు. నాలగేళ్లకు ఒకసారి వేతనాలు పెంచాలని ఉన్న చట్టాన్ని ప్రభుత్వం అమలు చేయకుండా కార్మికులకు ద్రోహం చేస్తుందన్నారు. అటువంటి చట్టాన్ని ఇప్పుడు మార్చి కార్మికులకు ఉరితాళ్లుగా చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలకు నిరసనగా మే 20వ తేదీన దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో కార్మికులు, రైతులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ తరగతులకు సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, సిఐటియు ఉపాధ్యక్షులు షేక్ వలీపాషా, సహాయ కార్యదర్శి తిరోజుల సురేష్, మెడవరపు రమాదేవి, కార్మికులు బురం శ్రావణి, అన్నపూర్ణ, అలివేలు, మంగ, దుర్గమ్మ, సీత పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - వేలేరుపాడు

మండలంలోని మద్దిగట్ల గ్రామంలో కంగాల సత్తిబాబు ఇల్లు శనివారం రాత్రి ప్రమాదవశాత్తు చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సత్తిబాబు కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. విషయం తెలుసుకున్న మల్లారం గ్రామస్తులు బాధిత కుటుంబానికి నిత్యావసర వస్తువులు, బియ్యం పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వసం కోల్పోయిన కంగాల సత్తిబాబు కుటుంబాన్ని దాతలు ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కౌన్సిల్ సభ్యులు కరక ముత్యాలు, కంగాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జనసేనలోకి పలువురు చేరిక

ఏలూరు సిటీ : ఏలూరు నియోజకవర్గంలోని ఆరో డివిజన్ మాదేపల్లి రోడ్డు, ఇందిరా కాలనీకి చెందిన సుమారు 50 మందికి పైగా వైసిపి నాయకులు, కార్యకర్తలు దోసపర్తి రాజు ఆధ్వర్యంలో జనసేన పార్టీలోకి చేరారు. ఏలూరు జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు, మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి ప్రసాద్, సీనియర్ నాయకులు రాఘవయ్య చౌదరి హాజరై వారికి పార్టీ కండువాలు కప్పి సాదారంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చి సుమారు 50 మందికి పైగా వైసిపి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు దోసపర్తి రాజు ఆధ్వర్యంలో జనసేనలో చేరారన్నారు.

నిబద్ధతగల పోరాటయోధుడు నాగభూషణరావు

నూజివీడు టౌన్ : బడుగు, బలహీనుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ఉద్యమాలను నిర్మించి అత్యంత విలువలతో కూడిన రాజకీయ ప్రస్థానాన్ని గడిపిన దాసరి నాగభూషణరావు నిబద్ధతగల పోరాటయోధుడు అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. దాసరి నాగభూషణరావు 17వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆయన స్వగ్రామం నూజివీడు మండలంలోని దిగవల్లి గ్రామంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అమర్ భవన్ వద్ద ఉన్న దాసరి విగ్రహానికి వనజ పూలమాలలు వేసి నివాళులర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు చూడడం కోసం విద్యార్థి దశ నుంచి దాసరి చేసిన పోరాటాలు, ఉద్యమాల గురించి వివరించారు. సిపిఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు మాట్లాడుతూ నిబద్ధత గల ప్రజా జీవితం దాసరి నాగభూషణరావుదన్నారు. భూ పోరాట యోధుడిగా పేరుగాంచిన దాసరి రాజ్యసభ సభ్యునిగా ప్రతి రూపాయి ప్రజల సంక్షేమం కోసమే వెచ్చించిన వ్యక్తి అన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు ఉద్యమించిన దాసరి నాగభూషణరావు తన సొంత ఆస్తులను సైతం ప్రజా సంక్షేమం కోసం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు రాయంకుల లక్ష్మణరావు, దిగవల్లి పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు గుంటక ధర్మారెడ్డి, మిట్టగూడెం మాజీ సర్పంచి వెలివెల నాగేశ్వరరావు, సిపిఐ నియోజకవర్గ నాయకులు నిమ్మగడ్డ నరసింహం, కూచి పూడి నాగేశ్వరరావు, మడుపల్లి నాగేంద్రరావు, కిత్తే రామారావు, యాదల సురేష్, దాసరి రాఘవేంద్రరావు, బత్తుల వెంకటేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.